దారంతా గుంతలే..!



- చెన్నేకొత్తపల్లి మండల వ్యాప్తంగా దెబ్బతిన్న రహదారులు
- అధికారంలోకి వచ్చాక రోడ్లను విస్మరించిన కూటమి ప్రభుత్వం
- నూతన రోడ్ల నిర్మాణానికి చర్యలు శూన్యం
- పట్టించుకోని అధికారులు

మట్టి రోడ్డుకే పరిమితమైన పైలబోయలపల్లి రహదారి

చెన్నేకొత్తపల్లి నుంచి చిన్నపల్లికి వెళ్లే రహదారిపై గుంతలు పడిన దృశ్యం

చెన్నేకొత్తపల్లి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హామీలన్నీ విస్మరిస్తోంది. కొత్త ప్రభుత్వం కొలువుదీరి ఆరు నెలలు గడుస్తున్నా రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవడం లేదు. కనీసం గుంతలు పడిన రహదారులకు మరమ్మతులు చేయంచలేదు. అధికారంలోకి వస్తే అది చేస్తాం.. ఇదీ చేస్తామని ఊదరకొట్టిన చంద్రబాబు గెలిచాక హామీలను పెడచెవిన పెట్టారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన రహదారులు గుంతలు పడటంతో దెబ్బతిన్నాయి. ఇక వర్షాకాలంలో ఈ గుంతలు వర్షపు నీటితో నిండిపోతున్నాయి. ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియడం లేదు. ద్విచక్ర వాహనాలు తిరగడానికి కూడా వీలులేకుండా తయారైంది. హరియాన్ చెరువు, చిన్నపల్లి, చిన్నంపేట, పైలబోయల పల్లి, ఓబుళంపల్లి నుంచి ఆమిదాలకుంటకు వెళ్లే గ్రామాల రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఈ గ్రామాల నుంచి రోజూ సొంత పనుల నిమిత్తం ధర్మవరం, పుట్టపర్తి ,కొత్త చెరువు గ్రామాలకు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. గుంతల దారుల్లో ద్విచక్ర వాహనాల్లో ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. పైగా ఈ గ్రామాలకు ఆర్టీసీ బస్సులు లేవు.

ఆటోల్లో కిక్కిరిసిన ప్రయాణికులతో ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ఎరువులు, విత్తనాలను ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో తరలించేందుకు రైతులు పడుతున్న అవస్థలు చెప్పలేనివి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వెంకటంపల్లి నుంచి ఒంటికొండ వరకూ తారు రోడ్డు వేశారు. ఒంటికొండ గ్రామం దాటిన తరువాత ఆమిదాలకుంట వరకు దాదాపు 4 కిలోమీటర్ల రోడ్డు గుంతలమయంగా మారిందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక హరియాన్ చెరువు, చిన్నపల్లి గ్రామాల మీదుగా మండల కేంద్రానికి వెళ్లే రహదారి గుంతలు ఏర్పడటంతో.. ప్రయాణం చేయడానికి అనుకూలంగా లేదు. పైలబోయలపల్లి రహదారికి మట్టి వేయడంతో వర్షాలు వచ్చినప్పుడు బురదతో నిండిపోతోంది. వర్షాలకాలంలో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ గ్రామాలకు రోడ్లు వేయించాలని కోరుతున్నారు.

వాహనాల్లో వెళ్లేందుకు ఇబ్బంది



గ్రామానికి వెళ్లే రహదారిపై గుంతలు పడ్డాయి. ప్రయాణం చేసేందుకు ఏమాత్రం అనుకూలంగా లేదు. ఈ రహదారిపై ద్విచక్ర వాహనంలో వెళ్లేందుకు చాలా అవస్థలు పడుతున్నాం. రాత్రి సమయంలో ప్రయాణం చేయాలంటే భయం వేస్తోంది. రోడ్డుపై ఎక్కడ ఏ గుంత ఉందో తెలియడం లేదు. ఈ రహదారిపై గుంతలను తప్పించబోయి పలువురు ప్రమాదాలకు గురయ్యారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో రోడ్లను పరిశీలించాలి. నూతన రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– హనుమంతరెడ్డి, చిన్నపల్లి, చెన్నేకొత్తపల్లి మండలం

ప్రతిపాదనలు పంపాం..

చిన్నపల్లి, హరియాన్ చెరువు గ్రామాలకు వెళ్లే రోడ్డుపై గుంతల పడ్డాయి. ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ గ్రామాల రోడ్ల మరమ్మతులు, కల్వర్టు నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం . ఇందుకోసం నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగింది. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చూసుకుంటాం.

– అబ్దుల్ ఖాదర్,
పీఆర్ ఏఈ, చెన్నేకొత్తపల్లి

ధర్మవరం మున్సిపల్ బడ్జెట్‌కు ఆమోదం



నూతన డంపింగ్‌యార్డుకు భూమి పూజ చేస్తున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరం అర్బన్: మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో సోమవారం చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి అధ్యక్షతన బడ్జెట్ సమావేశం నిర్వహించారు. మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2024–25 సవరణ బడ్జెట్ రూ.4,98,27,606 కాగా, 2025–26 సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ రూ.41,00,000 మిగులు బడ్జెట్ చూపించారు. 2025–26 సంవత్సరానికి సంబంధించి రెవెన్యూ రాబడి వసూళ్లు రూ.49,32,55,287, మూలధన వసూళ్లు రూ.26,60,00,000, రాబడి ఖర్చు రూ.45,15,92,410, మూలధన ఖర్చులు రూ.30,35,62,877తో బడ్జెట్‌ను మంత్రి, కౌన్సిల్ సభ్యుల సమక్షంలో ఆమోదించారు. అనంతరం మంత్రి, మున్సిపల్ చైర్‌పర్సన్ చేతులమీదుగా పారిశుధ్య కార్మికులకు యూనిఫాం పంపిణీ చేశారు. అనంతరం పలువురు కౌన్సిలర్లు పట్టణంలో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పట్టణంలోని కదిరిగేటు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కౌన్సిలర్ జేసీబీ రమణ మంత్రిని కోరారు. లక్ష్మీచెన్నకేశవపురం వైఎస్సార్ సర్కిల్‌లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయించాలని కౌన్సిలర్ గోరకాటి పురుషోత్తంరెడ్డి మంత్రికి విజ్ఞప్తి చేశారు.

డంపింగ్ యార్డు నిర్మాణానికి భూమిపూజ

ధర్మవరం మండలం తుమ్మల మల్లేనిపల్లి సమీపంలోనున్న మున్సిపల్ డంపింగ్ యార్డులో సోమవారం మంత్రి సత్యకుమార్ రూ.2.23 కోట్లతో నూతన డంపింగ్ యార్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. మంత్రి మాట్లాడుతూ మున్సిపాలిటికీ ఏడాదిలో 90 రోజులకు 40 టన్నుల దాకా సేంద్రీయ ఎరువు తయారీతో పాటు ఒక సంవత్సర కాలానికి రూ.14 లక్షల ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పట్టణంలో రోజుకు 73 టన్నులు చెత్త ఉత్పత్తి జరుగుతోందని తెలిపారు. ధర్మవరాన్ని స్వచ్ఛ ధర్మవరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, దాతలు, పట్టణ ప్రముఖులు భాగస్వాములు కావాలని సూచించారు. చెత్త నుంచి సంపద సృష్టించే విధంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహేష్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర నాయకులు చిలకం మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయాల సమస్యలు పరిష్కరించండి

ధర్మవరం: మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న కంటింజెంట్ ఆయాల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు సోమవారం మంత్రి సత్యకుమార్‌కు విన్నవించారు. గౌరవ వేతనం కింద ఇస్తున్న రూ.4వేలను రూ.10వేలకు పెంచాలని కోరారు.

ఈదులముష్టూరు చెరువుకు నీరొదలండి

బత్తలపల్లి: మండల పరిధిలోని ఈదుల ముష్టూరు చెరువుకు నీరు వదిలి న్యాయం చేయాలని మంత్రి సత్యకుమార్‌ను గ్రామ రైతులు కోరారు. సోమవారం ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కమతం కాటమయ్యతో కలిసి ధర్మవరంలో మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగేళ్లుగా గ్రామానికి చెందిన చెరువుకు నీరు వదలకపోవడంతో బోరు బావుల్లో భూగర్భ జలాలు తగ్గి పంటల సాగుకు ఇబ్బందులు తలెత్తాయన్నారు. పీఏబీఆర్ నీటిని మన్నీల కాలువ ద్వారానైనా తమ చెరువుకు వదలాలని విజ్ఞప్తి చేశారు.

నీటి ప్రణాళికపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తలుపుల : సుస్థిర వ్యవసాయ కేంద్రం ఎన్ఎఫ్‌కో ఆర్డినేటర్ శ్యామల ఆధ్వర్యంలో రాయలసీమ వాటర్ ప్రాజెక్ట్ ద్వారా సోమవాలవాండ్లపల్లి, ఎలగలబైలు గ్రామాల రైతులకు సోమవారం సాగునీటి ప్రణాళికపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఉన్న నీటి వనరుల సంరక్షణ, చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంల పునరుద్ధరణ చేపట్టడం, విరివిగా బోర్ల తవ్వకం వలన అడుగంటుతున్న భూగర్భ జలాలు తిరిగి రీస్టోర్ చేయడం వంటి చర్యలపై వివరించారు. ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో కిసాన్ మిత్ర కోఆర్డినేటర్ భాస్కర్, గ్రామ ప్రతినిధి వెంకటపతినాయుడు, వెంకటేశ్వర్లు, సీఆర్పీ కేపీ రమణ, రైతులు పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్లకు సంఘీభావం

నల్లచెరువు: విధుల నుంచి తొలగించిన తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆందోళన చేస్తున్న హెల్త్ అసిస్టెంట్లకు నల్లచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు కల్పనారెడ్డి, ఆరోగ్య సిబ్బంది సోమవారం సంఘీభావం ప్రకటించారు. డాక్టర్ కల్పనారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా కట్టడి చేయడంలో మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ల (ఎంపీహెచ్ఏ) పాత్ర చాలా కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రామచంద్రారెడ్డి, సూపర్‌వైజర్ సుధాకర్, భారతి, రెడ్డమ్మ చిన్నమ్మ శెట్టి, శంకర్, హెల్త్ అసిస్టెంట్లు సూర్యనారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, నారాయణ, ఏఎన్ఎంలు సరస్వతి, రోజా, యోగీశ్వరి, రాధ, భాగ్యమ్మ, వనజ, భాగ్యలక్ష్మి, రుక్మిణి, సరస్వతి, ఈశ్వరమ్మ,, ఎంఎల్‌హెచ్‌పీలు నస్రీన్, తస్లీమ్ భాను, సుమలత, హరిత, శాంతకుమారి, మౌనిక, గాయత్రి, ,శ్రావణి పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

కదిరి టౌన్: పట్టణంలో పేకాట ఆడుతున్న ఉపాధ్యాయులు హనుమంతరెడ్డి, మనోహర్‌రెడ్డితో పాటు అఖియార్, కటికే ఇషాద్, పి.ముస్తఫా, రాజశేఖర్, సంజీవరాయుడులను సోమవారం అరెస్ట్ చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. వీరి నుంచి రూ.1,12,420 నగదు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని మంగళవారం తహసీల్దార్ వద్ద బైండోవర్ చేయనున్నట్లు చెప్పారు.

విద్యుత్ సర్వీస్ తొలగింపుపై ఫిర్యాదు

పుట్టపర్తి: తమ వ్యవసాయ విద్యుత్ సర్వీస్‌ను అకారణంగా తొలగించారని ముదిగుబ్బ మండలం మంగళమడక గ్రామానికి చెందిన రైతు రంగమ్మ తన కుమారుడు రంగనాయకులుతో కలిసి సోమవారం పుట్టపర్తిలో ఎస్ఈ సురేంద్రకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ అధికారులు తమ వ్యవసాయ విద్యుత్ సర్వీస్‌ను తొలగించి.. వేరొకరి పేరుపైకి మార్చారని ఆరోపించారు. ప్రతి నెలా గ్రామానికి వచ్చి ఇంటి బిల్లుతో పాటు వ్యవసాయ బిల్లు కట్టించుకునేవారన్నారు. ఇటీవల తాము బిల్లు అడిగి ఇప్పించుకుని పరిశీలిస్తే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ వేరొకరి పేరుపై ఉందని బయటపడిందన్నారు. ఇందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుని, తమ పేరుపై కనెక్షన్ మార్చాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్ల రిపేరీకి డిమాండ్

కనగానపల్లి: వ్యవసాయ బోరుబావుల వద్ద పాడైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు త్వరగా మరమ్మతులు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహించారు. మండల కేంద్రం కనగానపల్లిలో వ్యవసాయ బోరుబావులకు అమర్చిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదని రైతు సంఘం నాయకుడు నాగరాజు, రైతులు సుబ్బరాయుడు, మోహన్ తెలిపారు. అనంతరం సబ్ ఇంజినీర్ జునైద్‌కు వినతిపత్రం అందజేశారు.

అదనపు కట్నం వేధింపులపై ఫిర్యాదు

కదిరి టౌన్: అదనపు కట్నం కోసం తన భర్త సాయికుమార్, అత్త గంగులమ్మ వేధిస్తున్నారని పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన అశ్విని సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు భర్త, అత్తపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

హత్యాయత్నం కేసులో రిమాండ్

కదిరి టౌన్: అడపాలవీధికి చెందిన మంజులపై జరిగిన హత్యాయత్నం కేసులో భర్త నాగేష్‌ను రిమాండ్‌కు పంపినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. దంపతులిద్దరూ మనస్పర్థల నేపథ్యంలో కొంతకాలంగావిడివిడిగా ఉంటున్నారన్నారు. అయితే ఆదివారం మాట్లాడాలని భార్యను నారాయణమ్మ కాలనీ బ్రిడ్జి వద్దకు పిలిపించుకున్న భర్త.. చార్జర్ వైర్‌తో చంపేందుకు ప్రయత్నించాడన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. సోమవారం నాగేష్‌ను అరెస్ట్ చేసి జడ్జి ముందు హాజరుపరచగా.. 14 రోజులు రిమాండ్‌కు ఆదేశించారని పేర్కొన్నారు.

క్లుప్తంగా

కార్పొరేట్ సెలూన్లకు అనుమతులు ఇవ్వొద్దు

కదిరి అర్బన్: పట్టణంలో కార్పొరేట్ సెలూన్ల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వకూడదని సోమవారం నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆర్డీఓ వెంకట సన్యాసి శర్మకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని దాదాపు 800 కుటుంబాలు బార్బర్ వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని నాయీ బ్రాహ్మణులు తెలిపారు. నేడు విచ్చలవిడిగా కార్పొరేట్ సెలూన్‌లు రావడంతో తమ కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చే శారు. బార్బర్ వృత్తితో సంబంధం లేని వ్యక్తులు కార్పొరేట్ సెలూన్లు ఏర్పాటు చేసి తమ ఉపాధికి గండికొడుతున్నారన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో హరిప్రసాద్, కృష్ణ, శివకుమార్, శ్రీనివాసులు, మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభంపై కూలిన చెట్టు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని యాదవవీధిలో వేపచెట్టు సోమవారం కూలి విద్యుత్ స్తంభంపై పడింది. విద్యుత్ వైర్లు తెగి కిందపడ్డాయి. ఆ సమయంలో ఎవ్వరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వెంటనే అధికారులు స్పందించి వేపచెట్టును తొలగించారు. స్తంభాన్ని మార్చి విద్యుత్ పునరుద్ధరించారు.

యూనివర్సిటీ క్రికెట్ జట్టుకు 'బ్లూమూన్' విద్యార్థులు



ఎంపికైన బ్లూమూన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు

కదిరి అర్బన్: ఎస్కే యూనివర్సిటీ క్రికెట్ జట్టుకు కదిరిలోని బ్లూమూన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు సాయి ప్రణీత్, వెంకటసాయి ఎంపికయ్యారు. వచ్చే ఏడాది జనవరిలో చెన్నైలో జరిగే అంతర్ యూనివర్సిటీ క్రికెట్ పోటీల్లో ఎస్కేయూ జట్టు తరపున వీరు పాల్గొననున్నారు. వర్సిటీ అనుబంధ కళాశాలల క్రికెట్ పోటీల్లో వీరు ఉత్తమ ప్రతిభకనబరచడంతో యూనివర్శిటీ జట్టుకు ఎంపికయ్యారు. అంతర్ విశ్వవిద్యాలయ పోటీల్లోనూ రాణించాలని బ్లూమూన్ విద్యాసంస్థల అధినేత శివశంకర్ ఆకాంక్షించారు.

హంద్రీ-నీవా జలాలకు హారతి



జల హారతి ఇస్తున్న ఎమ్మెల్యే

తలుపుల : కొరుగుట్టుపల్లి వద్ద హంద్రీ-నీవా కాలువలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పూజ చేసి జల హారతి ఇచ్చారు. అనంతరం కొండారెడ్డి చెరువు వరకు వెళ్లి చుట్టుపక్కల గ్రామాల రైతుల విజ్ఞప్తి మేరకు కాలువను తెంచి చెరువులోకి నీరు వదిలేలా చూడాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.

మల్బరీ సాగుపై క్షేత్రస్థాయి శిక్షణ



మల్బరీపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్

కదిరి అర్బన్: ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సెరికల్చర్ కోర్సు చదివే విద్యార్థులకు స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం క్షేత్రస్థాయి శిక్షణ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత మల్బరీ సాగుపై అవగాహన కల్పించారు. అలాగే సెరికల్చర్ కోర్సు, ఉపాధి అవకాశాలను తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు సనావుల్లా, హైదర్‌వలి, పీడీ నరసింహాచారి పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

కదిరి టౌన్: కుమ్మరోల్లపల్లికి చెందిన శివాజీపై ఆదినారాయణ కట్టెతో దాడిచేసి గాయపరిచాడు. గతంలో జరిగిన గొడవను మనసులో పెట్టుకుని ఈ దాడి చేశాడు. బాధితుడు శివాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు సోమవారం తెలిపారు.

ఆకట్టుకున్న 'రైతే రాజు' నాటిక



వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్ : కాకతీయ విద్యానికేతన్ హైస్కూల్‌లో సోమవారం జాతీయ రైతు దినోత్సవం నిర్వహించారు. రైతుల జీవనశైలి, వారు దేశానికి చేస్తున్న సేవలపై 'రైతే రాజు' పేరిట ప్రదర్శించిన నాటిక విద్యార్థులను ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులను పొలానికి తీసుకెళ్లి వ్యవసాయం, కర్షకుల శ్రమ గురించి ప్రయోగాత్మకంగా వివరించినట్లు కరస్పాండెంట్ నిర్మలాదేవి తెలిపారు.

వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షునికి సన్మానం



నరసింహమూర్తిని సత్కరిస్తున్న నాయకులు

పుట్టపర్తి టౌన్: వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షునిగా నియమితులైన నరసింహమూర్తిని మడకశిర నియోజకవర్గం జమ్మానిపల్లిలోని నివాసం వద్ద మున్సిపల్ వైస్ చైర్మన్ తిప్పన్న ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం ఘనంగా సత్కరించారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి నరసింహమూర్తి కృతజ్ఞతలు తెలిపారు. సన్మానించిన వారిలో ఎస్టీడీ నరసింహులు, ఫొటోసాయి, రామయ్య, సత్యన్న, అక్తర్, నరేష్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

పుట్టపర్తి: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని డీఐఈఓ రఘునాథరెడ్డి సూచించారు. సోమవారం కొత్తచెరువు జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఆయన స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతిర్లత, లెక్చరర్ రవీందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ స్కూల్‌ను మార్చాలి

ధర్మవరం: ఎంజేపీఏపీబీసీడబ్ల్యూ రెసిడెన్షియల్ స్కూల్‌ను బత్తలపల్లి నుంచి రేగాటిపల్లికి మార్చాలని ప్రజలు కోరారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో ఏఓ ఖతిజున్‌కుబ్రాను కలిసి వినతిపత్రం అందజేశారు. రేగాటిపల్లికి మంజూరైన రెసిడెన్షియల్ స్కూల్‌ను గ్రామంలోనే కొనసాగించాలన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

ఓడీచెరువు : మామిళ్ళకుంట్లపల్లి వద్ద గల జీవనజ్యోతి పాఠశాలలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. పాఠశాల సుపీరియర్ సిస్టర్ అనిత, ముఖ్య అతిథి డాక్టర్ భానుప్రకాశ్ క్రిస్మస్ పండుగ ప్రాముఖ్యతను వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ సిస్టర్ అమల, ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ డాలియా, తదితరులు పాల్గొన్నారు.

పంట తెగుళ్లపై సలహాలు

పుట్టపర్తి అర్బన్: రబీ పంటలకు వస్తున్న తెగుళ్లు, వ్యాధులను అధ్యయనం చేస్తున్న ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఎస్వీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు సలహాలు, సూచనలు తెలియజేశారు. రెండు నెలల నుంచి పుట్టపర్తి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన విద్యార్థులు పంటలకు సోకిన వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. పెడపల్లిలో రైతుల అనుభవాలను తెలుసుకొని కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వారికి తెలియజేశారు.

కార్యక్రమంలో పట్టు పరిశ్రమ సహాయకులు రమేష్, ఉద్యాన సహాయకులు డింపుల్ చౌదరి, విద్యార్థులు దిలీప్, సాయి శరణ్‌రెడ్డి, హరిప్రసాద్, శివకృష్ణ, సుశాంత్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ చట్టం తొలగించాల్సిందే

ధర్మవరం రూరల్: నూతన వ్యవసాయ మార్కెట్ చట్టాన్ని తొలగించాల్సిందేనని ఏపీ రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నగిరి కాటమయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న తదితరులు డిమాండ్ చేశారు. సోమవారం ధర్మవరం మార్కెట్‌యార్డ్ వద్ద సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు జీఓ కాపీలను దగ్ధం చేసేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. నాయకులను అదుపులోకి తీసుకుని టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం బయటకు వచ్చిన నాయకులు మాట్లాడుతూ జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లం మహేష్, నాయకులు ముత్యాలప్ప, పోతులయ్య, సీఐటీయూ నాయకులు ఎస్‌హెచ్ బాషా, మారుతి, జేవీ రమణ, ఆదినారాయణ, అయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మహా కాలభైరవాష్టమి పూజలు



దివ్యజ్యోతి వెలిగిస్తున్న పూజారి ధనుంజయ ఆచారి, భక్తులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని చక్రవర్తి థియేటర్ ఏరియాలోని స్వయంభు కాలభైరవస్వామి ఆలయంలో సోమవారం భక్తిశ్రద్ధల నడుమ పూజారి ధనంజయ ఆచారి ఆధ్వర్యంలో మహా కాలభైరవాష్టమి పూజలు నిర్వహించారు. ఆలయం ముందు అఖండ దివ్యజ్యోతిని వెలిగించారు. కాలభైరవస్వామి రుద్ర భైరవ అలంకరణలో దర్శనమిచ్చాడు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా గణిత దినోత్సవం

ఎన్పీకుంట: స్థానిక నాగార్జున ప్రైవేట్ హైస్కూల్‌లో సోమవారం గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ సేవలు ఎనలేనివని పేర్కొన్నారు. విద్యార్థులు గణితం పట్ల భయాన్ని వీడి ఇష్టంతో సాధన చేసినట్లయితే సులువుగా రాణించవచ్చని తెలిపారు. విద్యార్థులు తయారు చేసిన గణిత నమూనాలు ఆకట్టుకున్నాయి. అనంతరం గణిత ఉపాధ్యాయులకు మెమెంటో అందించి సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం మణికంఠ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాగు రైతులకు పట్టాలు మంజూరు చేయండి



ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఎన్పీకుంట: మండలంలోని మరికొమ్మదిన్నె, గొకనపేట, వెలిచలమల, ధనియానిచెరువు పంచాయతీల్లో రైతులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ, సీపీఎం నాయకులు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పై గ్రామాల్లో చాలామంది వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. అయితే ఆ ప్రాంతాల్లో సోలార్ పవర్ ప్రాజెక్టు కోసం భూములు సర్వే చేస్తున్నారని తెలిపారు. గతంలో కూడా మండలంలో ఏర్పాటైన సోలార్ పవర్ ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన రైతులకు తీవ్ర నష్టం జరిగిందని, ఇప్పుడు అలా జరగకుండా లీజు విధానంలో భూములు తీసుకోవాలని కోరారు. సాగురైతులకు అన్యాయం చేస్తూ ప్రాజెక్టుకు భూములు కేటాయిస్తే రైతుల పక్షాన ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ దేవేంద్రనాయక్ స్పందిస్తూ ప్రస్తుతం పంచాయతీల్లో భూముల రీసర్వే జరుగుతోందని తెలిపారు. సోలార్ ప్రాజెక్ట్ కోసం భూసేకరణ జరిగే సమయంలో ఆయా పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి సూచనలు తీసుకుంటామని, ప్రతి రైతుకూ న్యాయం జరిగే విధంగా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రమణ, జిల్లా కార్యవర్గ సభ్యులు సూర్యనారాయణరెడ్డి, సీపీఎం అనుబంధ రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.